## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే భరోసా



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మంచిర్యాల శాసనసభ్యుడు ప్రేమ్ సాగర్ రావు దండేపల్లి మండలంలో తెలంగాణ మోడల్ స్కూల్, కర్ణపేట గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత అధికారులను ఆదేశించి తక్షణమే పరిష్కరించాలని హామీ ఇచ్చారు. "విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడం మా బాధ్యత," అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పాఠశాలల్లో మరింత ఉత్తమ వాతావరణం కల్పించేందుకు కొన్ని మార్పులను సూచించారు.

**రైతు భరోసా నిధులపై కృతజ్ఞత ర్యాలీ..**

దండేపల్లి మండల కేంద్రంలో రైతుల ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. 9 రోజుల్లోనే 9వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు అందించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కార్యక్రమం జరి గింది. ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రేమ్ సాగర్ రావు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హా మీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ సభ్యులు, విద్యార్థి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఒర్రెలో పడి విద్యార్థి మృతి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** తాండూరు మండలం అచ్చులాపూర్ గ్రామంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదం తీవ్ర విషాదాన్ని కలిగించింది. కన్నెపల్లి మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన విఘ్నేష్ అనే యువకుడు ఈ ప్రమాదంలో మృతి చెందాడు. తెల్లవారుజాము 3:30 ప్రాంతంలో తన ట్రాక్టర్‌పై అచ్చులాపూర్ వైపు వెళ్తున్న విఘ్నేష్, ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఒర్రెలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో అతడు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనపై విఘ్నేష్ తండ్రి మల్లెత్తుల కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



## సింగరేణి పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలి

**శెనార్తి మీడియా, హైదరాబాద్/ మంచిర్యాల:** సింగరేణి సంస్థ చేపట్టే పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజా భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాల పరిమితి విధించుకొని ప్రాజెక్టులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

**ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, పవన విద్యుత్ ప్రణాళికలు..**

లోయర్ మానేరు డ్యామ్ వద్ద 300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్‌పై 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని, ఇరిగేషన్ శాఖ అనుమతులు త్వరగా పొందేందుకు కృషి చేయాలని సూచించారు. 5 జిల్లాల లో 500 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజె క్టులకు సంబంధించిన వివరాలను వచ్చే నెలాఖరు కల్లా సిద్ధం చేయాలని ఆదేశిం చారు.

**పంపుడ్ స్టోరేజ్ ప్లాంట్, సోలార్ వ్యాలీ..**

మేడిపల్లిలో 500 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం తక్షణమే ప్రారంభించాలని సూచించారు. రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి క్యాబినెట్‌లో ప్రతిపాదనలు ఉంచాలని తెలిపారు.

**గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ ప్రణాళికలు..**

సింగరేణి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థలపై కూడా సమీక్షించారు. అన్ని ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు డ్యాష్‌బోర్డ్‌ను రూపొందించాల్సిందిగా సూచించారు.

**సంస్థ భవిష్యత్ ప్రణాళికలు..**

సింగరేణి సంస్థ ద్వారా 7,000 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఎండీ బలరామ్ వివరించారు. ఈ ప్రాజెక్టులు సంస్థకు సుస్థిర భవిష్యత్‌ను అందించనున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రెడ్కో వైస్ చైర్మన్ వినిల, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## గణేష్ మండపం ముందు గోడ నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎంపీడీవోకు మహిళల వినతి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** గణేష్ మండపం ముందు గోడ నిర్మించి అడ్డుపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కిష్కింద పల్లె మహిళలు శనివారం శంకరపట్నం ఎంపీడీవో కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గత 20 సంవత్సరాలుగా గ్రామంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రులు, పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గణపతి మండపాన్ని వారి సొంత ఖర్చుతో నిర్మిం చారని, ఆ స్థలాన్ని సింగిల్ విండో మాజీ చైర్మన్ కాల్వ పాపిరెడ్డి విరాళంగా ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. ఇటీవల మండపం ముందు సీసీ రోడ్డును ఏర్పాటు చేశామని, ప్రతి సంవత్సరం నవరాత్రుల సందర్భంగా కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అయితే మండపం ముందు గుండవేని ఐలయ్య అనే వ్యక్తి గోడ నిర్మించి గేటు వేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఇది ప్రజల ఆస్తికి విఘాతం కలిగిస్తోందని ఫిర్యాదులో తెలిపారు. ఘటనపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**జూన్ 30న మినీ జాబ్ మేళా :**

- జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి రవికృష్ణ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా నిరుద్యోగ యువత కొరకు ఈ నెల 31 తేదీన ఉదయం 10:30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థ నందు 40 ఫార్మసిస్ట్, 20 ట్రైనీ ఫార్మసిస్ట్, 30 ఫార్మా అసిస్టెంట్, 10 రిటైల్ ట్రైనీ అసోసియేట్స్ పోస్టులకు గాను హైదరాబాద్/మంచిర్యాల ప్రాంతాలలో పని చేసేందుకు ఎస్. ఎస్. సి./ఇంటర్/డి. ఫార్మసీ/బి. ఫార్మసీ/డిగ్రీ అర్హత కలిగిన 18 నుండి 35 సంవత్సరాల వయసు గల పురుష అభ్యర్థులు సకాలంలో మినీ జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8247656356, 9121171671, 9110368501 నెంబర్లలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని ఆసక్తి అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వేతనాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు నాయకులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. శనివారం హాజీపూర్ మండలం గుడిపేటలోని మెడికల్ కళాశాలను సందర్శించిన తెలంగాణ ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రాత్ ఖానాంకు సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్, నర్సింగ్ కళాశాలల్లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న పేషంట్ కేర్, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రీషన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు తదితర వర్కర్లు గత ఆరు నెలలుగా వేతనాలు అందుకోలేదని పేర్కొన్నారు. అదేవిధంగా కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐలు సక్ర మంగా చెల్లించకపోవడమే కాకుండా, కాంట్రాక్టర్లు కార్మికుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారని ఆరో పించారు. సదరు ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కోరిన సిఐటియు, కార్మికుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీధర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్యాచరణ అవసరం: డబ్ల్యూజేఐ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల పరిస్థితులు ఆవేదనకరంగా ఉన్నాయని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరి కరుణాకర్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో డబ్ల్యూజేఐ నూతన కార్యవర్గ ఎన్నికల సందర్భంగా ఆయన మాట్లాడారు.

**మంచిర్యాల నూతన జిల్లా కమిటీ ఏర్పాటు**

వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా మంచిర్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా పార్వతి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బండ రవి ని ఎన్నిక చేశారు. ఈ కమిటీ సలహాదారులుగా బీరం రవి, మట్టే రవీందర్ నియమించబడ్డారు. ఉపాధ్యక్షులుగా కనుకుంట్ల వెంకట రాజ్, అల్లంల కుమార స్వామి, మామిడాల రవీందర్, పినుమల్ల గట్టయ్య నియమితులయ్యారు. కోశాధికారిగా దేగ ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా కంది రాజేష్, కొల్లూరి తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పార్వతి రాజేష్, ఇతర నాయకులు పరశురామ్, దుస్స శివప్రసాద్, ఈదునూరి సారంగరావు పాల్గొన్నారు.

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝాకు

## ఉత్కృష్ట సేవా పతకం



**శెనార్తి మీడియా, మంచిర్యాల / గోదావరిఖని:** పోలీసు శాఖలో ఉత్తమ సేవలకు కేంద్ర ప్రభుత్వం అందజేసే ఉత్కృష్ట సేవా పతకానికి రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఎంపికయ్యారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈ ఐపీఎస్ అధికారి సుదీర్ఘకాలం వివిధ హోదాలలో తన వృత్తిపరమైన నైపుణ్యంతో విధులను నిర్వర్తించారు. ఈ ఘనత సాధించిన అంబర్ కిషోర్ ఝాకు పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

- జిల్లా యువజన క్రీడాధికారి హనుమంతరెడ్డి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కొరకు రాష్ట్రస్థాయి ఎంపికల నిమిత్తం ప్రభుత్వ క్రీడా పాఠశాల హకీంపేట వద్ద నిర్వహించే పోటీలకు జిల్లా విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని జిల్లా యువజన క్రీడా అధికారి హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుండి ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలతో ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల లోపు హకీంపేట క్రీడా పాఠశాలలో హాజరుకావాలని తెలిపారు. జిల్లాలోని జన్నారం మండలానికి చెందిన బోర్లకుంట విష్ణు తేజ, దవులు తన్విత్, వి. అభ్యాస్, జె. రిషి వర్ధన్, అట్టెం శాన్విత శ్రీ, బోర్లకుంట మహిత, బండారి శృతిక, మందమర్రి మండలానికి చెందిన మాయ శ్రీయాన్, మిట్టకొల హన్షిత్, చిత్తారి అక్షయ, వేమనపల్లి మండలానికి చెందిన జి. అంజన్న, జి. నిహారిక, కె. శ్రీజ, ఎం. వర్షిని, బెల్లంపల్లి మండలానికి చెందిన కౌట్ల హర్షిత్ సాయి, అర్సం చిన్మయి చిత్రిక, మంచిర్యాల మండలానికి చెందిన షేక్ నయీమ్, దండే శ్రీయాన్సీ, కాసిపేట మండలానికి చెందిన మేడ సహర్షవర్ధన్, కన్నెపల్లి మండలానికి చెందిన జాడీ అక్షర లు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు సకాలంలో హాజరు కావాలని, వివరాలకు 9963539234 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

## సిపిఐ జిల్లా కార్యదర్శికి ఘన సన్మానం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** రామకృష్ణాపూర్‌లో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైన రామడుగు లక్ష్మణ్‌కు ఘన సన్మానం జరిగింది. పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన లక్ష్మణ్, పట్టణంలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను డిమాండ్ చేశారు. క్యాతన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌పై వీధిదీపాలు లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో స్మశాన వాటిక ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అలాగే, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఇప్పకాయల లింగయ్య, మిట్టపెల్లి పౌలు, నక్క వెంకటాస్వామి, వనం సత్యనారాయణ, కాదండి సాంబయ్య, మామిడి గోపీ, గాజుల మణెమ్మ, మారపెల్లి రవి, మద్దెలా శంకర్, చిరంజీవి బత్తుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.




## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి.. అలసత్వం సహించబోం

**సీపీ అంబర్ కిషోర్ ఝా**



**శెనార్తి మీడియా, మంచిర్యాల / గోదావరిఖని:** పోలీసు శాఖలో శాంతి భద్రతలు, నేరాల నియంత్రణకు అధికారులు నిరంతరం 24/7 అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. నెలవారీ సమీక్షలో భాగంగా రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తు పారదర్శకంగా ఉండాలని, అందుబాటులోని టెక్నాలజీ, శాస్త్రీయ పద్ధతులను వినియోగించాలని సూచించారు. మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులపై సమీక్ష నిర్వహించిన ఆయన, పెండింగ్ కేసుల పరిష్కారంలో గడువులు పాటించాలని, ముఖ్యంగా మహిళల మిస్సింగ్ కేసుల్లో వేగంగా స్పందించాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిఘా పెంచాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన సీపీ, బెల్లంపల్లి పట్టణంలో ఏటీఎం దొంగతన యత్నాన్ని నిరోధించిన ఎస్ఐ ప్రసాద్, బ్లూ కోల్ట్ బృందానికి క్యాష్ రివార్డ్ అందజేశారు. ఈ సమావేశంలో డిసిపిలు భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డిసిపి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, ఇతర అధికారులు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పన

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సులేమాన్, టి.జి.ఎం.ఐ.డి.సి. ఈ.ఈ. నరసింహారావులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని, త్వరలో విద్యాబోధన కొరకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద పద్ధతిన ఇతర పోస్టుల లో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న పోస్టులను అవసరం ఉన్న మేరకు భర్తీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో తలపెట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల, మాతా-శిశు కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మాణం కొన సాగుతున్న మాతా-శిశు ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి వార్డులు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## గ్రామసభ సామర్థ్య నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** పంచాయతీ కార్యదర్శులకు గ్రామసభల సామర్థ్య నిర్మాణంపై 2 రోజుల శిక్షణ నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు తెలిపారు. మంచిర్యాల శిక్షణ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం-2005, మహిళా సాధికారత, బాలల సంరక్షణ చట్టాలు, పంచాయతీ కార్యదర్శుల బాధ్యతలు, మహిళా గ్రామసభల ప్రాధాన్యతపై శిక్షణ ఇచ్చారు. పారదర్శకత, మెరుగైన స్థానిక పాలన కోసం గ్రామసభలను బలోపేతం చేయడమే లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రీసోర్స్ పర్సన్స్ ఎండి. అజ్మత్ అలీ, వి. శ్రీనివాస్, జి. శ్రీనివాస్, ఎస్. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.